సాక్షి వికారాబాద్

మంగళవారం ; 3 ; జనవరి ; 2023



అధ్వానంగా రహదారులు

జిల్లా పరిధిలోని చాలా రోడ్లు పాడయ్యాయి. అధ్వానంగా మారిన రహదారులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



కారును ఢీకొట్టిన టిప్పర్

ఓ కారును టిప్పర్ ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మద్వాపూర్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. 8లో▸



సమస్యలు త్వరగా పరిష్కరిస్తా

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

11న ఉత్తమ క్రీడాకారులకు సన్మానం

అనంతగిరి: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన (2017- 23 వరకు) క్రీడాకారులు, కరోనాలో విశేష సేవలు అందించిన వారిని సన్మానించనున్నట్లు ది లైట్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి.ఆనంద్, తెలంగాణ లగోరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర సభ్యుడు రాఘవన్‌నాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం వారు విడుదల చేశారు. ఈనెల 11న ఉదయం కొండా బాలకిష్టారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టంచేశారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అండర్- 14, 17, 19 బాలుర, బాలికలతో పాటు సీనియర్ ఆటగాళ్లు కూడా అర్హులేనన్నారు. క్రీడల్లో భాగంగా వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, క్రికెట్, లగోరీ, సైక్లింగ్, మల్లఖంబా, జూడో, తైక్వాండో, కరాటే, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, త్రోబాల్, హ్యాండ్ బాల్, ఫుట్ బాల్, షూటింగ్ బాల్, రెజ్లింగ్‌లలో రాణించిన వారై ఉండాలని తెలిపారు. వీరితో పాటు కరోనా వారియర్స్‌గా సేవలు అందించిన వారిని గుర్తించి సత్కరిస్తామని పేర్కొన్నారు. ఇటీవల బంగారు పతకాలు సాధించిన మాస్టర్ అథ్లెట్స్‌ను సన్మానిస్తామని చెప్పారు. వివరాలకు ఫోన్: 90142 22830లో సంప్రదించాలని సూచించారు.

'ప్రజావాణి'కి 60 ఫిర్యాదులు

సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిఖిల

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నిఖిల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 60 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సంబంధిత శాఖలకు వీటిని ఫార్వర్డ్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. భూ సమస్యలపై ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాలపై సమీక్ష

నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: వైకుంఠధామాలకు నీటి సరఫరా, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకుంఠధామాల్లో నీరు, విద్యుత్ సదుపాయాల కల్పన కోసం 226 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 118 అప్లికేషన్లకు పాలనపరమైన మంజూరు ఇచ్చామన్నారు. విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టి అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. వైకుంఠధామాల్లో విద్యుత్ సరఫరా నిమిత్తం అదనంగా కావాల్సిన స్తంభాలు, ఇతర పనుల నిమిత్తం అంచనాలను రూపొందించి సమర్పించాలని సూచించారు. వైకుంఠధామాల్లో వసతులను కల్పించి సంక్రాంత్రి లోపు వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ బాబుశ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని జిల్లా బాలికా శిశు అభివృద్ధి అధికారి ఉషారాణి, ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య, జేఏసీ నాయకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బా గాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో సోమవారం తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. శ్రీనివాస్ జ్ఞాపకార్థం పాపిశెట్టి కౌసల్య, కుమారస్వామి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రముఖ కవి గుర్రం భద్రయ్య రచించిన గీతాహృదయం పుస్తకాన్ని ఆవిష్కరించారు.



కొడంగల్‌లో విశేష అలంకరణలో స్వామివారు

వైకుంఠ వైభవం

జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలన్నీ జనంతో కిటకిటలాడాయి. కొడంగల్‌లోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని పూలమాలలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయ పండితులు ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చేస్తూ ప్రవచనాలు అందించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, డీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, హస్నాబాద్ సర్పంచు పకీరప్ప, ఆలయ ధర్మకర్తలు, అయ్యప్ప స్వామి మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

– కొడంగల్ రూరల్



స్వామివారి దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో వేచిఉన్న భక్తులు

మొక్కల గారడీ!

హరితహారం పేరుతో నిధుల దుర్వినియోగం

- వికారాబాద్ మున్సిపాలిటీలో అధికారుల ఇష్టారాజ్యం
- గతంలో మొక్కలు నాటిన చోటే అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో హంగామా
- ఈసారి గ్రీన్ బడ్జెట్ నుంచి రూ.42 లక్షలు డ్రా



ఆలంపల్లి రోడ్డులోని సిమెంట్ కుండీల్లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ అధికారులకు గ్రీన్ బడ్జెట్ కల్పతరువుగా మారింది. హరితహారం పేరుతో ఇష్టానుసారంగా ఈ నిధులు బొక్కేస్తున్నారు. హరితహారంలో భాగంగా ఈ ఏడాది గ్రీన్ బడ్జెట్ నుంచి రూ.42 లక్షలు ఖర్చు చేయడంపై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు సింగిల్ డివైడర్‌పై కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటుతున్నారు. ఇది చూస్తున్న ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎందుకంటే గతంలో రెండు సార్లు కుండీలు పెట్టి మొక్కలు నాటగా కుండీలు పగిలి, మొక్కలు ఎండిపోయాయి. ఈ ఏడాది గ్రీన్ బడ్జెట్‌లో భాగంగా కుండీలు, మొక్కలు కొనుగోలుకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. ఇందుకోసం సాధారణ ధరకన్నా ఎక్కువ మొత్తం చెల్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సింగిల్ డివైడర్‌పై కుండీలు ఏర్పాటు చేయడంపై కౌన్సిల్‌లో పెద్దఎత్తున రగడ జరిగినా అధికారులు మాత్రం పట్టించుకోకుండా పనులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

మూడేళ్లుగా ఒకేచోట

హైదరాబాద్ ప్రధాన రోడ్డు కొత్రేపల్లి నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు గత ఏడాది మున్సిపల్ ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ ఏడాది కూడా ఇదే మార్గంలో మరోసారి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గంట వ్యవధిలో నాలుగు వేల మొక్కలు నాటారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కూడా హాజరయ్యారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో మొక్కలు నాటినందుకు గాను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ తరఫున అదే రోజు మున్సిపాలిటీకి ప్రశంసాపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా గతేడాది మొక్కలు నాటిన చోటే ఈ ఏడాది సైతం పెద్దఎత్తున అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టినట్లు, ఇందుకోసం రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు రాశారు. నాటిన చోటనే తిరిగి మొక్కలు నాటుతున్నట్లు రికార్డులు రాస్తూ జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అవినీతి ఆరోపణలు

అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల కొనుగోలులో అధికారులు అవినీతికి పాల్పడ్డారని గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కొందరు కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిల్ సమావేశంలోనే ప్రకటించారు. ఆ తర్వాత చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఈ విషయాన్ని మరుగున పడేశారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు కూడా ప్రశ్నించకపోవడంతో ఇదే అదనుగా అధికారులు గ్రీన్ బడ్జెట్‌ను పూర్తిగా బొక్కేశారనే ఆరోపణలు ఉన్నాయి.

కొను'గోల్‌మాల్'

హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు, సపోర్టు కట్టెల కొనుగోలులో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలున్నాయి. మొక్కలకు సపోర్ట్‌గా పాత కట్టెలు, డయా కోసం రూ.5 లక్షలు ఖర్చు చేశారు. సాధారణ ధరలకన్నా ఎక్కువ పెట్టి కొనుగోలు చేశారనే ప్రచారం జరిగింది. ఈ విషయం అధికార పార్టీ కౌన్సిలర్లకు తెలిసినా చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు మధ్య సయోధ్య లేకపోవడంతో బయటకు చెప్పలేకపోతున్నారని సమాచారం. ఈ విషయంపై అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారులు విచారణ చేపడితే తప్పకుండా అవినీతి బయటకు వస్తుందనే అభిప్రాయం పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఒక హైదరాబాద్ రోడ్డులోనే

ఎప్పుడూ అధికారులు రాకపోకలు సాగించే హైదరాబాద్ రోడ్డులోనే అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి తాండూరు, ధన్నారం, కొత్తగడి, బుగ్గ వైపు తూతూమంత్రంగా పూర్తిచేశారు. నాటిన మొక్కలకు ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా నీరు పోయలేదనే ఆరోపణలున్నాయి.

ప్రైవేటు యంత్రాలంటూ బిల్లులు

మున్సిపాలిటీకి సంబంధించి ఓ జేసీబీ, రెండు వాటర్ ట్యాంకర్లు, మొక్కలు నాటే యంత్రం ఉంది. హరితహారానికి సంబంధించిన పూర్తి పనులను వీటితోనే చేయించారు. కానీ జేసీబీతో పాటు, ప్రైవేటు వాటర్ ట్యాంకులు అద్దెకు తీసుకున్నట్లు పేర్కొని రూ.లక్షల్లో బిల్లులు డ్రాచేశారని తెలుస్తోంది. మొక్కలకు నీళ్లు పట్టారంటూ ప్రైవేటు ట్యాంకర్లకు రూ.5 లక్షలు చెల్లించారు. కానీ క్షేత్ర స్థాయిలో మున్సిపల్ ట్యాంకర్లతోనే మొక్కలకు నీళ్లు అందించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్రను వివరణ అడిగేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అవెన్యూ ప్లాంటేషన్ రోడ్డు	మొక్కల కొనుగోలుకు ఖర్చు
కొత్తగడి నుంచి ఆలంపల్లి	రూ.4.8 లక్షలు
ధన్నారం రోడ్డు	రూ.3.70 లక్షలు
తాండూరు రూట్	రూ. 4.40 లక్షలు
హైదరాబాద్ మార్గం	రూ. 5 లక్షలు
బుగ్గ రహదారి	రూ. 4.60 లక్షలు
పరిగి రోడ్డు	రూ. 4.90 లక్షలు
సపోర్టు కట్టెలు	రూ. 5 లక్షలు
నీటి సరఫరా ట్యాంకర్లకు	రూ. 5 లక్షలు
సిమెంట్ కుండీల కొనుగోలు	రూ. 5 లక్షలు

సీడీఎంఏలో ఫిర్యాదు చేశాం



ఈ ఏడాది హరితహారంలో 16వేల మొక్కలు నాటినట్లు అధికారులు లెక్కలు రాశారు. కానీ క్షేత్ర స్థాయిలో ఏడు నుంచి ఎనిమిది వేల మొక్కలు మాత్రమే ఉన్నట్లు తేలింది. మొక్కలు, సపోర్టు కట్టెల కొనుగోలులో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ చేయాలని సీడీఎంఏ, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు గతంలోనే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు. ఇటీవల మరోసారి సీడీఎంఏను సంప్రదించగా అదనపు కలెక్టర్ విచారణ చేస్తారని తెలిపారు. ఇటీవలే వచ్చిన అడిషనల్ కలెక్టర్‌ను కలవగా, విచారణ చేస్తామన్నారు.

– మంజులరమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్

కదలని 'మన బడి'

- పనుల్లో తీవ్ర జాప్యం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- బిల్లుల చెల్లింపులోనూ నిర్లక్ష్యం

దౌల్తాబాద్: 'మన ఊరు- మనబడి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీటి నిర్వహణకు సర్పంచ్‌లు ముందుకు రాకపోవడంతో ఎస్ఎంసీ చైర్మన్లే చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

24 స్కూళ్ల ఎంపిక

మండలంలోని 24 జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తికావాల్సి ఉండగా.. బిల్లుల చెల్లింపు విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో పనులు నిర్వహించడంలో కాంట్రాక్టర్లు ఆసల్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో తాము అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మొదటి విడతలో దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలకు రూ.59.53 లక్షలు, పీఎస్‌కు రూ.14.49 లక్షలు, దౌల్తాబాద్ బాలికల పాఠశాలకు రూ.48.35 లక్షలు, అల్లాపూర్ స్కూల్‌కు రూ.3.70 లక్షలు, బాలంపేట రూ.63.09 లక్షలు, బిచ్చాల రూ.66.03 లక్షలు, చల్లాపూర్ రూ.15.82 లక్షలు, చంద్రకల్ రూ.16.13 లక్షలు, ఈర్లపల్లి రూ.4.48 లక్షలు, గోకఫసల్‌వాద్ రూ.6.54 లక్షలు, కౌడీడ్ రూ.41.17 లక్షలు, కుదురుమళ్ల రూ.5.21లక్షలు, నాగసార్ రూ.9.61 లక్షలు, నందారం రూ.3.28 లక్షలు, నర్సాపూర్ రూ.3.45 లక్షలు, పోల్కంపల్లి రూ.14.62 లక్షలు, సురాయిపల్లి రూ.17.18 లక్షలు, మాటూరు రూ.4.69 లక్షలు, నీటూరు రూ.39.21 లక్షలు, తిమ్మారెడ్డిపల్లి రూ.6.30 లక్షలు, బాలంపేట రూ.69.01 లక్షలు, బిచ్చాల రూ.21.27 లక్షలు, కుదురుమళ్ళ ఉన్నత పాఠశాలకు రూ.80.17 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్లు తదితరాలకు కూడా ఉపాధి హామీ కింద అదనంగా రూ.4.73 కోట్లు మంజూరయ్యాయి.

పర్యవేక్షణ కరువు

మనబడి పనులను పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. కానీ మూడు మండలాలకు ఒక్కరే ఇంజనీరింగ్ ఉండడంతో పర్యవేక్షణ తూతూ మంత్రంగా సాగుతోంది. ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాళ్లు బేస్‌మెంట్ దశలో ఉండగా టాయిలెట్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్లాస్టరింగ్, కరెంటు పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. ఫోన్‌లలో మానిటరింగ్ చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.



దౌల్తాబాద్‌లో ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు

నాణ్యత పాటించాలి



మండలంలో చేపట్టిన పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. చేసిన పనులకు బిల్లుల చెల్లింపులోనూ ఆలస్యానికి కారణమవుతోంది. ఉన్నతాధికారులు చొరవచూపాలి.

– సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు

వేగం పెంచాం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనుల్లో కొంత ఆలస్యం జరిగింది. ఇటీవలే వేగం పెంచాం. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడటం లేదు. సాధ్యమైనంత వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పనులను పర్యవేక్షించడం లేదనేది అవాస్తవం.

– రవికిరణ్, ఏఈఈ

న్యాయ సేవా సంస్థ ప్రారంభం



న్యాయ సేవా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

- చైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్, సెక్రటరీగా జస్టిస్ శీతల్
- వికారాబాద్‌లో నూతన కార్యాలయం ప్రారంభం
- సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపు

వికారాబాద్ అర్బన్: న్యాయ సేవా సంస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె.సుదర్శన్ అన్నారు. రాష్ట్రంలోని 23 జిల్లాలకు సంబంధించిన న్యాయసేవా సంస్థలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం ఉదయం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం న్యాయ సేవా సంస్థ జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి సుదర్శన్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజల సమస్యలకు సత్వర న్యాయం చూపేందుకు కృషిచేస్తామని తెలిపారు. లోక్ అదాలత్‌ల ద్వారా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామని స్పష్టంచేశారు. అవసరమైతే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయ సేవా సంస్థ యాక్టు 1987లో అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, లోక్ అదాలత్ సదస్సులను నిర్వహించి కేసులను సత్వరం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు జిల్లా న్యాయసేవా సంస్థ అందించే సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం న్యాయ సేవా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డి.బి శీతల్‌కు జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీకాంత్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రుతిదూత, జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో భక్తుల సందడి

మొయినాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవాలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. చిలుకూరులో ఉత్తర ద్వారం లేకపోయినా పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి విశిష్ఠతను వివరించారు.

క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు చౌడాపూర్, కుల్కచర్ల తహసీల్దార్లు అశోక్ కుమార్, రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ హాజరుకానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని లబ్ధిదారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ధారూరు సీఐగా అప్పయ్య



ధారూరు: ధారూరు సర్కిల్ సీఐగా అప్పయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అప్పయ్య వికారాబాద్ జిల్లా డీసీ ఆర్‌బీ నుంచి ఇక్కడికి బదిలీపై రాగా ఇక్కడ పనిచేసిన సీఐ తిరుపతిరాజు వికారాబాద్ జిల్లా డీసీఆర్‌బీకి బదిలి అయ్యారు.

వేతనాలు పెంచాలి

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: మిషన్ భగీరథ కార్మికుల కు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నీరందిస్తున్నా కార్మికులకు మాత్రం పస్తులు తప్పడం లేదని అన్నారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదని.. ఈఎస్‌ఐ, పీఎఫ్ గుర్తింపు కార్డు ఇవ్వడం లేదని.. ఎనిమిది గంటల పని అమలు చేయడం లేదన్నారు. వెంటనే కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.24 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్, సహాయ కార్యదర్శి దివ్య ప్రతాప్, యూనియన్ నాయకులు వెంకటేశ్, రవి, యాదయ్య, బాలరాజ్, కార్మికులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను దగా చేస్తున్న ప్రభుత్వం

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సర్పంచులను ప్రభుత్వం దగా చేస్తోందని రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను కేంద్రం నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తుండగా.. సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇతర అవసరాలకు మళ్లించడం అన్యాయమని అన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధుల మళ్లింపు అంశాన్ని నిరసిస్తూ పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టులకు పాల్పడడాన్ని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అరెస్టును ఖండించారు. సోమవారం ఆయన తన బృందంతో కలిసి ఇందిరాపార్కు వద్దకు చేరుకున్నారు.

అధ్వానంగా రహదారులు

ప్రతిపాదనలకే పరిమితమైన పనులు

- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

వికారాబాద్: జిల్లా పరిధిలోని రోడ్లన్నీ పాడయ్యాయి. అధ్వాన్నంగా మారిన రోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిపాదనలు పంపామని చెబుతున్న అధికారులు కనీసం వాటికి తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. దీంతో ఏళ్ల నుంచి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది కురిసిన వర్షాలతో నష్టాలనే మూటగట్టుకోవాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ పూర్తిగా అస్తవ్యస్థంగా తయారై ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు గాని పంచాయతీరాజ్ అధికారులు గాని స్పందించడం లేదు. జిల్లా వ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరిస్తున్నామంటున్నారే తప్ప తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. రోడ్ల అభివృద్ధి పనులకు మూడు నుంచి ఐదు సార్లు టెండర్లు పిలిచినా ఒక్కరూ టెండర్ వేయలేదు.

టెండర్ల దగ్గరే నిలిచిన పనులు

గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్ల వివరాలు ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అధికారులు చేపట్టిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 198కిలోమీటర్ల మేర రోడ్లు పాడైనట్లు తేలింది. వీటి పూర్తిస్థాయి మరమ్మతుకు రూ.89కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అవి మంజూరై వచ్చే లోపు తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు అవసరమైన రోడ్లను సైతం ఆశాఖ అధికారులు గుర్తించారు. ఇందుకు రూ.8కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. కాగా ఇందులో ఆర్‌అండ్‌బీ శాఖ 98కిలోమీర్ల మేర పాడైన రోడ్లకు రూ.39కోట్లు మంజూరు చేసింది. ఇక పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి పాడైన రోడ్లకు రూ.20కోట్లు మంజూరయ్యాయి. అయితే ఈ రెండు శాఖల్లోనూ పాడైన రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు, రోడ్లు మంజూరు, టెండర్ల ప్రక్రియ దగ్గరే నిలిచిపోయాయి. టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో రోడ్లు మరమ్మతులకు నోచుకోడం లేదు. వాహణదారులకు యాతన తప్పడం లేదు.

మెజార్టీ రోడ్లన్నీ శిథిలం

జిల్లాలో ఒకటి రెండు రోడ్లు మినహా మెజారిటీ రోడ్లన్నీ అధ్వాన్నంగానే ఉన్నాయి. వికారాబాద్–పరిగి, వికారాబాద్–నవాబుపేట, వికారాబాద్–సిద్దులూర్, వికారాబాద్–బుగ్గ దేవాలయం వేళ్లేదారి, వికారాబాద్–తాండూరు రహదారి, కొడంగల్–తాండూరు, కొడంగల్–మహబూబ్‌నగర్, పరిగి–మిట్టకోడూర్, దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి–గొడుగోనిపల్లి, ఐనాపూర్–పాలెపల్లి, గడిసింగాపూర్–మల్లెపల్లి, పరిగి–షాద్‌నగర్, వికారాబాద్–సదాశివపేట్, కోటాలగూడ–లాల్‌సింగ్ తాండ, మన్నెగూడ–మిర్జాపూర్ మీదుగా లాల్‌సింగ్ తండా తదితర రోడ్లన్నీ అధ్వాన్నంగానే మారాయి.



కొటాలగూడ–లాల్‌సింగ్‌తండా రోడ్డు దుస్థితి



కంకర తేలిన దోర్నాల్‌పల్లి రోడ్డు

త్వరలో మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి రూ.98 కిలోమీటర్ల మేర బాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇందుకు రూ.39కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఐదు సార్లు టెండర్లు పిలిచాం. కానీ టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. త్వరలో మరమ్మతులు చేపడతాం. వికారాబాద్–నవాబుపేట రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేస్తాం.

– లాల్‌సింగ్, ఈఈ, ఆర్‌అండ్‌బీ, వికారాబాద్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

షాద్‌నగర్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధి కారి ఐజయ్య అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఫెమినా మహిళా మండలి అధ్యక్షురాలు అలియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న మగ్గం వర్క్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. నిరుద్యోగం రూపు మాపేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించే శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలియా సుల్తానా మాట్లాడుతూ.. మూడు నెలల పాటు 30 మంది మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది సబియా సుల్తానా, శిక్షకురాలు యాస్మిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయండి

పురుగు మందు డబ్బాలతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

పెద్దేముల్: ప్రిన్సిపల్ వేధింపులు భరించలేకపోతున్నామంటూ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోట్లపల్లి శివారులో తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల కొనసాగుతోంది. ఇక్కడ 414మంది విద్యార్థులకు గాను 17 మంది ఉపాధ్యాయులు, నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు.

ఇతర పనులు చేయిస్తున్నారు

మడల పరిధిలోని గాజీపూర్, బుద్దారం, గోట్లపల్లి గ్రామానికి చెందిన పీఈటీ ప్రశాంత్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ మధుసూదన్‌రెడ్డి, అటెండర్ లాలప్ప, వాచ్‌మెన్ రమేశ్ ఏడాదిన్నరగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్నారు. ప్రిన్సిపల్ తమపై కక్షగట్టారని.. పనులు నేరుగా చెప్పకుండా ఇతరులతో చెప్పిస్తున్నారన్నారు. ఆమె ప్రవర్తనతో అభద్రతాభావానికి గురవుతున్నామనివా పోయారు. ప్రిన్సిపాల్ వేధింపులు ఆపకుంటే పాఠశాల ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



స్కూల్ ఎదుట పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

అవి ఆరోపణలు మాత్రమే



విధులు సక్రమంగా నిర్వహించక తనపై ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆరోపణలు చేస్తున్నారని ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. అటెండర్ లాలప్ప మద్యం తాగి విధులకు వస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ మధుసూదన్‌రెడ్డికి కంప్యూటర్‌పై పూర్తిగా అవగాహన లేనందున ఏజెన్సీ నిర్వాహకులకు ఫిర్యాదు చేశామన్నారు.

‘ట్రెసా ఆధ్వర్యంలో ‘నూతన’ వేడుకలు

అనంతగిరి: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ట్రెసా(తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిఖిల కేక్‌కట్ చేశారు. అనంతరం నాయకులు ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయేందర్, వహిదాఖాతూం, దీపక్, రమేశ్, షాహిదా బేగం, రవీందర్, అమరేంద్రకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అధికారుల శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా జెడ్పీ, పంచాయతీరాజ్ అధికారులు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీపీఓ తరుణ్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, తెలంగాణ ఎంపీటీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, పలువురు ఎంపీడీఓలు, ఎంపీఓలు శుభాకాంక్షలు తెలిపారు.



కేక్‌కట్ చేస్తున్న కలెక్టర్ నిఖిల



కలెక్టర్‌తో జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలు

కారును ఢీకొట్టిన టిప్పర్

ముగ్గురికి గాయాలు



గాయపడిన కరుణాకర్

బంట్వారం: ఓ స్విఫ్ట్ కారును టిప్పర్ ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్ సమీపంలో చోటుచేసుకుంది. విరరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని ఖానాపూర్, కొత్తూరు గ్రామాలకు చెందిన కరుణాకర్, శ్రీనివాస్, నాగేశ్ స్నేహితులు. వీరు ముగ్గురు స్విఫ్ట్ కారులో బంట్వారం వైపు నుంచి వికారాబాద్ వెళ్తున్నారు. అదే సమయంలో మద్వాపూర్ గ్రామం నుంచి అజాగ్రత్తగా, అతివేగంగా వస్తున్న ఓ ఖాళీ టిప్పర్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కరుణాకర్ తీవ్రంగా గాయపడగా.. మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను వెంటనే 108అంబులెన్స్‌లో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌ను సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి టిప్పర్ డ్రైవర్ గోరెప్పపై కేసు నమోదు చేస్తామన్నారు. టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు.



నుజ్జునుజ్జయిన కారు

చేపల వేటకు వెళ్లి మృత్యువాత



రాములు మృతదేహం

బషీరాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీంపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విద్యారణ్‌రెడ్డి ప్రకారం.. కాశీంపూర్ గ్రామానికి చెందిన బోయిని రాములు(38) కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ఊరికి సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపలకు వేసిన వలను తీసేందుకు వెళ్లగా కాళ్లు వలకు చిక్కుకుని నీట మునిగాడు. అతడితో వచ్చిన వారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చెరువంతా గాలించగా సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. సోమ వారం మృతుడి భార్య ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పిన కారు

నలుగురు విద్యార్థులకు గాయాలు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టును సందర్శనకు వచ్చిన బీటెక్ విద్యార్థుల కారు అదుపుతప్పడంతో వారు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం ధారూరు–వికారాబాద్ ప్రధాన రోడ్డు బాచారం సమీపంలో చోటుచేసుకుంది. సీఐ అప్పయ్య తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్ సమీపంలోని వీజేఐటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు గౌతమి, షేక్ నజీర్, నూప్రా, సాయితేజ మండల పరిధిలోని కోట్‌పల్లి సందర్శనకు వచ్చారు. తిరుగుప్రయాణంలో వేగంగా వెళ్తున్న వీరి కారు బాచారం సమీపంలోని వంతెనను బలంగా ఢీకొట్టారు. దీంతో కారులోని నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐలు అప్పయ్య, నరేందర్, ఏఎస్‌ఐ మురళి, పోలీసులు క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాద స్థలిలో నుజ్జునుజ్జయిన కారు



గాయపడిన గౌతమి



షేక్ నజీర్



నూప్రా



సాయితేజ

మోక్ష మార్గం.. ఉత్తర ద్వార దర్శనం



ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో శుభప్రద్ పటేల్, విజయ్ కుమార్ పూజలు



అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆనంద్ దంపతులు



అనంతపద్మనాభ స్వామి పూజలో మాజీ మంత్రి చంద్రశేఖర్

- వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు
- ఆలయాల్లో మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతగిరి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వికారాబాద్ పట్టణం, మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోవింద నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. వైష్ణవ దేవాలయాల్లో భక్తులు స్వామి వారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. పట్టణంలోకి వేంకటేశ్వర స్వామి, రాంమందిరంలో ఆలయంలో ఉత్తర ద్వారానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలంపల్లి లక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు.

నిత్యం ఉత్తర ద్వార దర్శనం

వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరి గుట్టలో ఉదయం ఉత్తర ద్వారానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ స్వామి వారు నిత్యం ఉత్తర ద్వార దర్శనమే ఇస్తారు.

ప్రజాప్రతినిధుల ప్రత్యేక పూజలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దంపతులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో, ఆలంపల్లిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, పలువురు నాయకులు ఆలంపల్లిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల దంపతులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. వీరితో పాటు పలువురు కౌన్సిలర్లు, అధికారులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.



అనంత పద్మనాభ స్వామివారి సేవలో ఎస్పీ కోటిరెడ్డి



వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల క్యూ



వేంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు

శభాష్ అసద్



మంత్రి సబితారెడ్డికి నోట్‌పుస్తకాలు అందిస్తున్న అసద్

శంకర్‌పల్లి: తన పిలుపునకు స్పందించి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులతో నోట్‌పుస్తకాలు కొని తెచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థిని మంత్రి సబితారెడ్డి అభినందించారు. శంకర్‌పల్లికి చెందిన ఎండీ జిలానీ కుమారుడు అసద్ స్థానిక రేవతి పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా తనను కలవడానికి వచ్చేవారు బొకేలు, శాలువాలకు బదులు పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ వస్తువులు అందించాలని ఇటీవల మంత్రి సూచించారు. విషయం తెలుసుకున్న అసద్ తనవంతుగా తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.1,500తో నోట్‌పుస్తకాలు కొన్నాడు. సోమవారం నగరంలో మంత్రిని కలిసి వాటిని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. వీటిని ఎలా కొన్నావని మంత్రి అడగడంతో విషయం చెప్పాడు. దీంతో మంత్రి శభాష్ అసద్ అంటూ అభినందించారు.

మ్యాట్‌ల అందజేత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతీక్‌జైన్ స్పందించారు. సోమవారం మర్యాద పూర్వకంగా ఆయన మంత్రిని కలిశారు. మంత్రి సూచన మేరకు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో కాకుండా అంగన్‌వాడీ పిల్లలకు సంబంధించిన మ్యాట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



అంగన్‌వాడీ పిల్లల మ్యాట్‌లు అందజేస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్